మినీ కథ;

# "ప్రాక్టికల్ నాలెడ్జి"

తన పిల్లలు చెడిపోవడం జగన్నాధాని కిష్టంలేదు. వాళ్లిద్దరూ పెరిగి పెద్దవారయి తనకు కీర్తిప్రతిష్ఠ తేవాలి. వాళ్ల సక్రమ మార్గంలో పెరగాలంటే వాళ్ల ఏ దురలవాట్లకూ లోనుకాకూడదు. తన తదనంతరం తన ఆస్థిని వృధాచేయకూడదు. అదీ ఆతని ఆశయం. అందుకే ఆతడు ఒక రోజు ఓ క్షయవ్యాధిని యింటికి తీసుకొచ్చి "చూడండి! ఇతడు నా స్నేహితుడు. సిగరెట్లు తాగి క్షయ కొనితెచ్చుకుని ఎలా బాధపడుతున్నాడో గమనించండి" అన్నాడు. పిల్లలిద్దరూ సిగరెట్లు తాగకూడదని నిశ్చయించుకున్నారు వెంటనే. మరో రోజు మరో టీబీ పేషెంటు. అతడు త్రాగుబోతు అని చెప్పాడు జగన్నాధం కొడుకులకు. తాగకూడదని నిశ్చయించుకున్నారు వారిద్దరూ. మరో రోజు మరొకడు. ఆ మరుసటి రోజు ఇంకొకడు. ఇలా చాలా దురలవాట్ల గూర్చి కొడుకులకి 'ఇన్‌డైరక్టు'గా పాఠాలు చెప్పాడు జగన్నాధం.

ఒక రోజు కొడుకులిద్దరినీ రేసు కోర్సుకి తీసుకెళ్ళాడు. "ఇతగాడు చూడండి వేలువేలు గుర్రాలమీద ధార పోస్తాడు. ఉదాహరణకి ఇవాళ ఏదో టిక్కెట్టు కొన్నాడు. అతణ్ణి మీరిద్దరూ శ్రద్ధతో గమనించండి" అని ఓ వ్యక్తిని చూపెట్టాడు.

గుర్రాలు పరిగెత్తాయి. జగన్నాధం కొడుకులిద్దరూ ఆ వ్యక్తిని శ్రద్ధగా పరిశీలిస్తున్నారు. ఆ వ్యక్తి గుర్రాలని అంతకంటే శ్రద్ధగా పరిశీలిస్తున్నాడు.

"రేసుల్లో ఇవాళ డబ్బు పోయి అతగాడెంత విలపిస్తాడో మీ కళ్ళతో మీరే స్వయంగా గమనించండి" అని మరోసారి అన్నాడు జగన్నాధం.

గుర్రాలు ఆగిపోయాయి. ఆ వ్యక్తికి జాక్‌పాట్ వచ్చింది. జగన్నాధం హతాశుడయాడు. కనుక 'రేసు గుర్రప్పందాల' వ్యసనం మాత్రం జన్మలో కొడుకులకు మాన్పించలేకపోయాడు. అతడి ఆస్తి అతని తదనంతరం హారతి అయింది.

—"కార్టూనిస్టు శశిధర్',

